క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1.01 లక్షల విరాళం



దాతలకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు సోమవారం రూ. 1,01,116 విరాళంగా అందజేశారు. విజయవాడ సమీపంలోని సత్యన్నారాయణపురానికి చెందిన బొమ్మరాజు రఘునాథరావు, సుజాత దంపతులు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాత దంపతులకు ఆలయ సూపరింటెండెంట్ గోపీనాథ్ విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జెడ్పీటీసీ రమేష్, ఎంపీటీసీ సాయిబాబు

కామవరపుకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాడు-నేడుతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు తీర్చిదిద్దారని జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్, జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. సోమవారం ఆడమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. మధ్యాహ్న భోజన నాణ్యతను గురించి విద్యార్థును అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు. పాఠశాలలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉప్పలపాటి సాయిబాబు, వేములసాయి, నాని, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజలకు ఆరోగ్య పరీక్షలు



దళితవాడలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చురుగ్గా కొనసాగుతోంది. సోమవారం కమ్యూనిటీ హెల్త్ అధికారులు, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలు తెలుసుకోవడంతో పాటు, అవసరమైనవారికి వైద్యపరీక్షలు నిర్వహించారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని దళితవాడలో సోమవారం వైద్యారోగ్య శాఖ సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి, ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేశారు.

కన్నాపురం వాసవీ క్లబ్ శాఖకు అవార్డులు



అవార్డులు పొందిన కన్నాపురం క్లబ్ సభ్యులు

కొయ్యలగూడెం: కన్నాపురం వాసవీ క్లబ్ శాఖ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకుగాను మూడు అవార్డులు లభించినట్లు క్లబ్ సభ్యుడు మట్టే శ్రీనివాస్ సోమవారం పేర్కొన్నారు. నల్లజర్ల శ్రీవేణుగోపాల స్వామి హాల్లో నిర్వహించిన రీజనల్ కాన్ఫరెన్స్ సెమినార్‌లో నల్లజర్ల సునీల్‌కు సూపర్ బెస్ట్ ప్రెసిడెంట్‌గా, అద్దెపల్లి కేశవకు బెస్ట్ సెక్రటరీ అవార్డు, బొమ్మ మోహన్‌లకు బెస్ట్ కోశాధికారి అవార్డు అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రీజియన్ చైర్మన్ గుళ్లపూడి వెంకటరత్నం హాజరయ్యారన్నారు.

యువతకు వాలీబాల్ కిట్‌ల అందజేత



యువతకు వాలీబాల్ కిట్‌లను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పోలవరం రూరల్: యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. పోలవరం గ్రామపంచాయతీ సచివాలయం -2 పరిధిలోని కమ్మరగూడెంలోని యువతకు టీబీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం వాలీబాల్ కిట్‌లను అందజేశారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆదేశాల మేరకు యువతకు వాలీబాల్ కిట్‌లను అందజేసినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొడుం శ్యామ్‌కుమార్, ఈదేపల్లి వెంకటగణేష్, సచివాలయ కన్వీనర్ మాదేపల్లి సాయి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా ఊరేగింపులు, అన్నసమారాధనలు



కొయ్యలగూడెం: బోడిగూడెంలో గణనాథుని ఊరేగింపు



కుక్కునూరు: గోదావరిలో నిమజ్జనానికి వెళుతూ..



లింగపాలెం: మఠంగూడెంలో ట్రాక్టర్‌పై వినాయకుని ఊరేగింపు

ద్వారకాతిరుమల: గణేష్ నవరాత్రులను పురస్కరించుకుని వాడవాడలా భారీ అన్నసమారాధనలు, వినాయక నిమజ్జన వేడుకలు అట్టహాసంగా జరుగుతున్నాయి. కమిటీ సభ్యులు పోటాపోటీగా వాటిని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ద్వారకాతిరుమలలోని శ్రీవారి దేవస్థానం హైస్కూల్ వద్ద అలాగే వసంత్‌నగర్ కాలనీలో సోమవారం ఉత్సవ కమిటీ సభ్యులు భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. ముందుగా హైస్కూల్ వద్ద శ్రీ వరసిద్ధి వినాయకునికి, వసంత్‌నగర్ కాలనీలో శ్రీ లక్ష్మీ గణపతికి కమిటీ సభ్యులు విశేష పూజలు జరిపి, నివేదనలు సమర్పించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. మంగళవారం స్థానిక గుడిసెంటర్‌లో అన్నసమారాధన కార్యక్రమం జరుగనుంది.

కుక్కునూరు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను సోమవారం గోదావరిలో నిమజ్జనానికి తరలించారు. వినాయక ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గణనాథుని విగ్రహాలను ట్రాక్టర్లపై ఉంచి ఊరేగింపుగా నిమజ్జనానికి బయలుదేరారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చుతూ డీజే నృత్యాలు చేశారు. నిమజ్జనానికి ముందు రోజు సాయంత్రం స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని బహిరంగ వేలం పాట నిర్వహించారు. మంగళవారం మహాఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు చెప్పారు.

కొయ్యలగూడెం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం 8వ రోజు గణేష్ ఊరేగింపు అన్న సమారాధనలు, నిమజ్జనోత్సవ కార్యక్రమాలు మండలంలోని పలు గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. కొయ్యలగూడెంలోని గణేష్ సెంటర్లో ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనలో సుమారు 6వేల మందికి పైగా భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు. స్వామి వారి ఊరేగింపు ఉత్సవం మంగళవారం నిర్వహించనున్నారు. బోడిగూడెం గ్రామంలో ముత్యాలమ్మ గుడి సెంటర్లో గణనాథుని ఊరేగింపు ఉత్సవం యువకులు ఘనంగా నిర్వహించారు. కన్నాపురం, రాజవరం, బయనగూడెం, గ్రామాలలో గణేష్ ఊరేగింపు ఉత్సవాలు నిర్వహించారు.

ఘనంగా వినాయకుని నిమజ్జనోత్సవం

కామవరపుకోట: మండలంలో ఆడమిల్లి, తడికలపూడిలో రెడ్డిల కాలనీవాసులు, కామవరపుకోటలో కొత్తపేట, వీరభద్ర కాలనీవాసులు వినాయకు నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. ట్రాక్టర్‌పై వినాయకుని ప్రతిమను పూలతో అలంకరించి, తీన్మార్ డప్పులు, డీజే సౌండ్ల నడుమ యువకులు డ్యాన్సులు వేస్తూ ఊరేగింపు నిర్వహించారు. కామవరపుకోట కొత్తపేటలో అన్న సమారాధాన జరిపారు. లడ్డూ ప్రసాదాలు వేలం నిర్వహించారు.



ద్వారకాతిరుమల హైస్కూల్ వద్ద నిర్వహిస్తున్న భారీ అన్నసమారాధన



కొయ్యలగూడెంలో గణేష్ సెంటర్‌లోని ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం



వినాయకుని నిమజ్జనోత్సవంలో పాల్గొన్న కామవరపుకోట వీరభద్ర కాలనీవాసులు

దళితుల పక్షాన నిలిచిన నాయకుడు సీఎం జగన్

గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



అసెంబ్లీలో మాట్లాడుతున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల: రాష్ట్రంలో దళితుల పక్షాన నిలబడిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. శాసనసభలో షెడ్యూల్ కులాల సంక్షేమంపై సోమవారం ఆయన మాట్లాడారు. దళితుల పేరు చెబితే అందరికీ గుర్తుకొచ్చేది దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దళితులకు ఆయన ఎంతో మేలు చేశారన్నారు. దళితుల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా వైఎస్సార్ పాలన సాగించారని గుర్తు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి తండ్రికి మించిన పాలనను అందిస్తూ, దళితుల పక్షాన నిలుస్తున్నారన్నారు. రాష్ట్రంలో దళితుల సంక్షేమానికి రూ. 65 వేల కోట్లు వెచ్చించినట్టు చెప్పారు. గత టీడీపీ హయంలో చంద్రబాబు ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను కూడా దుర్వినియోగం చేశారని, ఆయన పాలనలో దళితుల సంక్షేమానికి రూ.35 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. అయితే టీడీపీ నాయకులు తమ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని, సీఎం వైఎస్ జగన్ చేస్తున్న మంచిని చూసి ఓర్వలేకే అలా ప్రవర్తిస్తున్నారని అన్నారు. విజయవాడ నడిబొడ్డున రూ.500 కోట్లతో అంబేడ్కర్ విగ్రహ నిర్మాణాన్ని చేపట్టడం హర్షణీయమన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీలకు ఒకొక్కరికీ అరెకరం చొప్పున మొత్తం వెయ్యి ఎకరాలను పంపిణీ చేశామన్నారు. జగన్ పాలనలో దళితులకు అంతా మేలే జరుగుతోందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో విద్యార్థులు ఉన్నత చదువులు చదువుతున్నారని, విదేశీ విద్యను కూడా పొందగలుగుతున్నారని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి మండలానికి ఒక అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి కోరారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఏడీ కె.శ్రీనివాస్

టి.నరసాపురం: విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా పామాయిల్ గెలలు కోసే కార్మికులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో కామవరపుకోట ఏడీ కె.శ్రీనివాస్ అన్నారు. టి.నరసాపురంలో సోమవారం పామాయిల్ రైతులు, గెలలు కోసే కార్మికులకు విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రైతుల చేలలో ఉన్న విద్యుత్ వైర్ల వల్ల గెలలు కోసే సమయంలో ప్రమాదాలు జరిగి గెలలు కోసే కూలీలు తరచూ మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాలకు ట్రాన్స్‌కో నుంచి ఎటువంటి నష్టపరిహారం వచ్చే అవకాశం లేదని వివరించారు. విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా కార్మికులు, రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. గెలలు కోసే సమయంలో కాలికి బూట్లు వేయడం, గెలలు కోసే గెలకు ఇన్సులేషన్ ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షం కురిసే సమయంలో గెలలు కోయరాదన్నారు. సదస్సులో ఏఈ డి.శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి డి.ముత్యాలరావు, రైతు ప్రతినిధులు దేవరపల్లి అజాద్, పెద్దిన ప్రసాద్, మాజీ సర్పంచ్ జోనుబోయిన సోంబాబు, మాజీ వైస్ ఎంపీపీ అద్దంకి జగ్గారావు, లైన్‌మన్ గంగాధర్, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ, మలేరియా, టైఫాయిడ్ కిట్‌ల పంపిణీ



డెంగీ, మలేరియా, టైఫాయిడ్ కిట్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

కుకునూరు: మండలంలో ప్రస్తుతం డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర విషజ్వరాల తీవ్రత దృష్ట్యా ఐటీడీఏ పీవో శానిటేషన్, మందుల కిట్‌లను అందజేశారని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కిట్‌లను సంబంధిత గ్రామాల పంచాయతీ సిబ్బందికి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంటింటి శానిటేషన్ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అలాగే అవసరమైన చోట వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం, ఆరోగ్య పరిరక్షణా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో మంగళవారం నుంచి శానిటేషన్ కార్యక్రమాలు డోర్ టు డోర్ స్ప్రేయింగ్, ఫాగింగ్ తదితర పనులు ఉధృతంగా నిర్వహించాలని ఆదేశించారు. కాగా ఆయా గ్రామాలకు రక్తపరీక్షల నిమిత్తం ఆర్‌డీటీ కిట్‌లు 256, వాటర్ క్లీనింగ్ అండ్ శానిటేషన్ బ్యాక్టీసైడ్ పౌడర్ 40 కేజీలు, యాంటి లార్వా నిమిత్తం వెక్ట్ ఓ బ్యాక్స్ 12 ఏఎస్ 20 లీటర్లు, ఇండోర్ స్ప్రే నిమిత్తం గోకిలా హెచ్‌టీఎస్, 5 ఈసీ 30 లీటర్లు అందజేయడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు.

సీసీ డ్రెయిన్ నిర్మాణ పనుల ప్రారంభం



సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు ప్రారంభ పూజలు నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు

కొయ్యలగూడెం: గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమ ఫలాలు ఒకొక్కటిగా ప్రజలకు లభిస్తున్నాయని జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. కొయ్యలగూడెం-కన్నాపురం రోడ్డులో లైబ్రరీ నుంచి నిర్మించబోయే సీసీ డ్రైన్ నిర్మాణానికి సోమవారం ఆమె ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభ పూజలు నిర్వహించారు. టెంపుల్స్ సెంటర్ వరకు రూ.20 లక్షల నిధులతో నిర్మాణం చేపట్టామని, ఎమ్మెల్యే తెల్లం బాలరాజు చొరవతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలు, ఎంపీ కోటగిరి శ్రీధర్ నిధుల నుంచి మరో రూ.10 లక్షలు వెచ్చించడంతో సమస్య పరిష్కారానికి కార్యరూపం దాల్చిందని జెడ్పీటీసీ చెప్పారు. పోలవరం రోడ్డులో సీసీ రోడ్డు డ్రెయిన్ నిర్మాణం రెండు దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోలేదని ఈనాటికీ గ్రామ ప్రజల సుదీర్ఘ కోరిక నెరవేరగలుగుతుందని అన్నారు. ఎంపీపీ గంజిమాల రామారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు మంతెన సోమరాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ తాడిగడప రామకృష్ణ, ఎంపీటీసీలు చింత శ్రీదేవి, గంటా శ్రీనివాస్, ఘంటసాల సీనమ్మ, సంకుకొండ, మద్దు గోపి, మారిశెట్టి శ్రీను, చిరవూరి శ్రీనివాస్, నిక్కర్ నాగేశ్వరరావు, ఏలేటి భాస్కర్, చిటికెన నాగార్జున, పల్లంట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం కొత్త పంపు ట్రయల్ రన్



గూటాల ఎత్తిపోతల పథకం కాలువను పరిశీలిస్తున్న ఏపీఎస్ఐడీసీ ఈఈ అనురాధ

పోలవరం రూరల్: మండలంలోని గూటాల ఎత్తిపోతల పథకాన్ని ఏపీఎస్ఐడీసీ ఈఈ ఎం.అనురాధ సోమవారం పరిశీలించారు. ఎత్తిపోతల పథకానికి ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ ఇచ్చిన ఎంపీ నిధులతో కొత్త పంపు బిగించి ట్రయల్ రన్ నిర్వహించారు. గత ఏడాది పోలవరం మండల పర్యటనలో భాగంగా గూటాల ఎత్తిపోతల పథకాన్ని ఎంపీ కోటగిరి శ్రీధర్ సందర్శించారు. ఎత్తిపోతల పథకం నీటి సంఘం అధ్యక్షుడు కరిబండి శ్రీనివాస్‌తో పాటు పలువురు రైతులు పంపులకు మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఆయన మంజూరు చేయించిన ఎంపీ నిధులు రూ.35 లక్షలతో ఎత్తిపోతల పథకానికి కొత్త పంపును ఏర్పాటు చేశారు. పంపు పనిచేసే విధానాన్ని ఈఈ అనురాధ పరిశీలించి సంఘ సభ్యులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డీఈ దుర్గా గురవయ్య, ఘంటా శ్రీనివాస్, కరిబండి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోయింగ్ జట్టుకు అభినందనలు

ద్వారకాతిరుమల: ప్రస్తుతం జరుగుతున్న ఆసియా క్రీడల్లో రోయింగ్ లైట్ వెయిట్ పురుషుల విభాగంలో దేశానికి తొలి పతకం రావడం హర్షణీయమని అంతర్జాతీయ రోయింగ్ క్రీడాకారుడు యు.విజయ్ అన్నారు. స్థానిక విలేకర్లతో సోమవారం ఆయన మాట్లాడుతూ ముందుగా అంతర్జాతీయ స్థాయి రోయింగ్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. వాటర్ స్పోర్ట్స్‌కు మంచి భవిష్యత్ ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం ఎర్ర కాలువలో శిక్షణా కేంద్రం నడుస్తోందన్నారు. రాష్ట్ర స్కల్లింగ్ అండ్ రోయింగ్ అధ్యక్షులు తరుణ్ కాకాని క్రీడాకారులకు మంచి ప్రోత్సాహాన్ని ఇస్తున్నట్టు చెప్పారు. తాను జాతీయస్థాయిలో జరిగిన రోయింగ్ ఛాంపియన్ షిప్‌లో రాష్ట్రం తరఫున అనేకసార్లు పాల్గొని, పతకాలు సాధించినట్టు తెలిపారు. ఎర్ర కాలువ వాటర్ స్పోర్ట్స్‌లో కోచ్, ఇన్చార్జిగా తాను పనిచేసినట్టు విజయ్ పేర్కొన్నాడు. పతకాలు సాధించిన భారత రోయింగ్ జట్టుకు, కోచ్ ఇస్మయిల్ బేగ్‌కు అభినందనలు తెలిపాడు.

ఎస్పీకి ఫిర్యాదు

కుక్కునూరు: గొర్ల పెరంబాబు మృతిపై సమగ్ర విచారణ జరిపి అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం పెరంబాబు తల్లిదండ్రులు జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. పెరంబాబును అతని భార్య కృష్ణవేణి, ఆమెతో అక్రమ సంబంధం పెట్టుకున్న సురేష్ కలిసి హత్య చేశారని మృతుడి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీనిపై కుక్కునూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా భార్యభర్తల మధ్య గొడవ నేపథ్యంలో భార్య కృష్ణవేణి, ,పెరంబాబును గొంతు పట్టుకోని తోసివేయడంతో అతను మృతి చెందాడని విచారణలో తేలిందని కుక్కునూరు పోలీసులు విచారణలో పేర్కొన్నారు. అయితే దీనిపై సమగ్రంగా విచారణ జరపాలని ఎస్పీని కలిసి విన్నవించుకున్నట్లు పెరంబాబు తల్లిదండ్రులు చెప్పారు.

పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి



పుట్లగట్లగూడెంలో జయంతి వేడుకలు నిర్వహించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: పుట్లగట్లగూడెంలో బీజేపీ ఆధ్వర్యంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు అర్జుల మురళీకృష్ణ, బీజేపీ మండల అధ్యక్షుడు పారేపల్లి సత్యనారాయణ, కార్యదర్శి గణపవరపు రామచంద్రరావు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అర్జుల మురళీ కృష్ణ మట్లాడుతూ పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ భారతీయ జనతా పార్టీ, భారతీయ జనసంఘ్ సిద్ధాంత కర్త అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం తయారు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

టి.నరసాపురం: అక్రమంగా మద్యం తయారు చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు చింతలపూడి ఎక్సైజ్ సీఐ సుంకర సాయి స్వరూప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో గల టి.నరసాపురం మండలం మధ్యాహ్నపువారిగూడెం గ్రామంలో అక్రమంగా నాటుసారా తయారు చేస్తున్నారనే సమాచారంతో సోమవారం తన సిబ్బందితో దాడి చేశారు. దాడిలో ఒక వ్యక్తిని అరెస్టు చేసి సారా తయారీకి ఉపయోగించే 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

స్పందనలో 15 అర్జీలు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీవో ఎం.ఝాన్సీరాణి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం నాటి స్పందన కార్యక్రమంలో ఎక్కువగా భూ సంబంధిత సమస్యలపై అర్జీలు వచ్చినట్లు చెప్పారు. సదరు సమస్యలను సంబంధిత శాఖాధికారులకు ఎండార్స్ చేసినట్లు వివరించారు. సోమవారం నాటి స్పందనలో 15 అర్జీలు వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

28న వరల్డ్ రేబిస్ డే

జంగారెడ్డిగూడెం: వరల్డ్ రేబిస్ డే సందర్భంగా జంగారెడ్డిగూడెం పశువైద్యశాలలో పశువులకు ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ వేయడం జరుగుతుందని పశువైద్యాధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28వ తేదీన ప్రపంచ రేబీస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రజలకు రేబీస్ వ్యాధిపై అవగాహన కల్పించడంతో పాటు పెంపుడు జంతువులకు రేబీస్ సోకకుండా ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో వివరిస్తామని వారు తెలిపారు.

రైతు సంక్షేమమే సొసైటీల ధ్యేయం

లింగపాలెం: రైతు సంక్షేమమే ధ్యేయంగా సహకార సంఘాలు పనిచేస్తున్నాయని ధర్మాజీగూడెం సహకార సంఘం సొసైటీ అధ్యక్షుడు ఉప్పలపాటి వరప్రసాద్ అన్నారు. సహకార సంఘం ఆవరణలో సోమవారం నిర్వహించిన మహాజన సభలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకార వ్యవస్థను బలోపేతం చేసి సంఘాలు అభివృద్ధి బాటలో పయనించేలా ప్రోత్సహిస్తున్నారని అన్నారు. ధర్మాజీగూడెం సొసైటీ ద్వారా సుమారు రూ.35 కోట్ల మేర రైతులకు రుణాలు అందించగా, సుమారు రూ.13 లక్షల మేర లాభాల్లో ఉందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి డి ప్రకాశరావు, సొసైటీ డైరెక్టర్ ఖండవల్లి ఇమానేలు, రైతులు పాల్గొన్నారు.

విజయదుర్గమ్మ ఆలయ మహిళా కమిటీ ఏర్పాటు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో కొలువైన విజయదుర్గమ్మ ఆలయానికి శాశ్వత చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ ఆధ్వర్యంలో నూతన మహిళా కమిటీని నియమించినట్లు కమిటీ ప్రధాన కార్యదర్శి మాడ రామమోహనరావు తెలిపారు. అధ్యక్షురాలుగా మానేపల్లి రోహిణి, ఉపాధ్యక్షురాలుగా చిన్ని జయలక్ష్మి, బొల్లిన పూర్ణ, వి.పద్మ, కొణిజెర్ల ఛాయాపద్మిని, యర్రం గీత, వీరవల్లి సత్యవతి, గొట్టుముక్కల భవానీ, బుద్ధాల కృష్ణవేణిలతోపాటు పలువురు సభ్యులను నియమించారు. వీరిని పసుపు, కుంకుమ, శేషవస్త్రాలతో సత్కరించి, అర్చకులు సుదర్శనం వేణు గోపాలాచార్యులు అమ్మవారి ఆశీర్వచనాలు అందజేశారు.

నేడు జీడి మామిడి చెట్ల ఫలసాయానికి వేలం

కామవరపుకోట: చింతలపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ, కామవరపుకోట సబ్ యార్డ్ నందు గల సుమారు నాలుగు ఎకరాల భూమిలో 24 జీడి మామిడి చెట్ల ఫలసాయమును పొందుటకు 2023-24 సంవత్సరము గాను మంగళవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు చింతలపూడి మార్కెట్ యార్డ్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి ఎస్‌కే మహారాజ్ పాషా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కామవరపుకోట సబ్ యార్డ్ నందు ఈ వేలం నిర్వహించనున్నామని, ఆసక్తి గలవారు రూ.2 వేలు ధరావతు చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

రిలయన్స్ స్కాలర్‌షిప్‌లపై అవగాహన సదస్సు

జంగారెడ్డిగూడెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రిలయన్స్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్‌లపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎన్.ప్రసాద్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ సీహెచ్ వరహాలు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల గురించి వివరించారు. అర్హులైన విద్యార్థులకు త్వరలో రాత పరీక్ష నిర్వహిస్తామని, ఇందులో మెరిట్ సాధించిన విద్యార్థులకు సంవత్సరానికి రూ.50 వేల చొప్పున నాలుగేళ్లపాటు నగదు చెల్లిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగ అధిపతి యు.వెంకటాచార్యులు, గణిత విభాగ అధిపతి సీహెచ్ బదరీ నారాయణ, ఇతర అధ్యాపకులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.